క్లుప్తంగా

ఘనంగా వన మహోత్సవం



వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ప్రజల వన మహోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి వన మహోత్సవానికి వెళ్లి అక్కడ వంటావార్పు చేసి వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు, పశుసంపదను కాపాడాలని వనదేవతలను వేడుకొని నైవేద్యాలను సమర్పించారు. అనంతరం కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పరామర్శ



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లికి చెందిన సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు బాలస్వామి (72) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని సీపీఐ నాయకులు జైపాల్‌రెడ్డి, వెంకటస్వామి ఎర్రజెండాలతో నివాళులర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ బాలయ్య మృతి తీరని లోటు అని అన్నారు. సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడిగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు.

పెద్దకార్పాములలో యువ సంఘటన్ యాత్ర



పెద్దకొత్తపల్లి: బీజేవైఎం యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం యువసంఘటన్‌యాత్ర కొనసాగినట్లు బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పరుశరాం తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో యువకులు మేల్కొని బీజేపీ జెండాను చేతపట్టుకొని మార్పుకోసం ప్రయత్నించాలని ఆయన సూచించారు. గతంలో పరిపాలించిన నాయకులతోపాటు ప్రస్తుతం ఉన్న నాయకులు కూడ పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించలేదని ఆయన అన్నారు. కొల్లాపూర్ అభివృద్ధి చెందాలంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లేని సుధాకర్‌రావును గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేష్, మల్లికార్జున్, మద్దిలేటి, సిద్దార్థ, శివ, మార్కెండేయ, జగదీష్, విష్ణు, వెంకటరమణ, వినోద్, కృష్ణ, వంశీ పాల్గొన్నారు.

గురుకుల సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

కొల్లాపూర్ రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం చివరి తేది ఈనెల 16వరకు నిర్ణయించినట్లు, అయితే విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 20 వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దుండగులను శిక్షించాలి

మన్ననూర్: పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటరమణ, ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

వంగూరు: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగుల పరీక్ష పత్రాల లీకేజీపై మండల యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివశంకర్, నాయకులు మల్లయ్య, శ్రీశైలం, పుల్లయ్య, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు జయంతి



కల్వకుర్తిరూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం పట్టణంలోని వాసవీ క్లబ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు లక్ష్మీ, శ్రీనివాసులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ రమేష్, శంకర్, మనోహర్, శ్రీధర్, కృష్ణయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

- కల్వకుర్తిలో రైతుల ఆందోళన
- 4 గంటలపాటు వాహనదారులకు అంతరాయం



రాస్తారోకో చేస్తున్న రైతులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తుర్కలపల్లికి చెందిన రైతులు దుర్గయ్య, రామస్వామిలు రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని నినాదాలు చేస్తూ చౌరస్తాను 4 గంటల పాటు దిగ్బంధించారు. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. కల్వకుర్తి నుంచి చుట్టుపక్కలకు వెళ్లేందుకు దారులు ఉండడంతో పోలీసులు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను దారిమళ్లించారు. రైతులు 4 గంటల పాటు రాస్తారోకో నిర్వహించడంతో ప్రమాదానికి కారణమైన వారి తరుపున బంధువులు పోలీసులు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో పాటు కొద్ది మేర పరిహారం అందించేందుకు అంగీకారం కుదరడంతో రాస్తారోకో విరమించారు. సర్పంచ్ ఎల్లయ్య, శివకుమార్, రామకృష్ణ తదితర ఆధ్వర్యంలో రాస్తారోకో కొనసాగింది. సీఐ సైదులు, ఎస్‌ఐ రమేశ్ యాదవ్‌లు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బందోబస్తు నిర్వహించారు.



నిలిచిపోయిన వాహనాలు

దేవాలయ అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుకిందెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మహాత్మాగాంధీతండాలో హనుమాన్ దేవాలయ నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. కొన్నేళ్లుగా హనుమాన్ దేవాలయ నిర్మాణానికి ఎదురుచూస్తున్నట్లు తండావాసులు పేర్కొన్నారు. ఐక్యత ఫౌండేషన్ సహకారంతో దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తండావాసులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంతునాయక్, శంకర్‌నాయక్, రాందాసునాయక్, లక్ష్మణ్‌నాయక్, కాడురామ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి

బల్మూర్: మండలంలోని రాంనగర్‌కాలనీలో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. అయితే ఈ వర్షానికి పిడుగు పాటు పడగా ఓ కాడెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు గోపాల్‌నాయక్ పశువులు వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా ఒక్కసారిగా వర్ష బీభత్సం చెలరేగి పిడుగు పడటంతో అందులో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు వాపోయాడు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కల్వకుర్తిరూరల్: సీఎం సహాయనిధి పథకం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి, వెల్దండ మండలాల పరిధిలోని 19 మందికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. లింగసానిపల్లికి చెందిన పార్వతమ్మకు రూ.44వేలు, నీలాంబర రావుకు రూ.60వేలు, వెల్దండకు చెందిన నిర్మలకు రూ.40 వేలు, జీడిపల్లి చంద్రయ్యకు రూ.51వేలు, మార్చాల రేణుకకు రూ.43 వేలతో పాటు పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తనవంతు సహకారం అందించడంతో పాటు అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్దన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య, సర్పంచ్‌లు కృష్ణయ్య, పరుశరాములు, నాయకులు బాలయ్య, గంగాధర్, మనోహర్‌రెడ్డి, గణేశ్, ఖాజ, కిషోర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌కి చెందిన నాగరాజు కొద్ది రోజుల నుంచి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ మేరకు ఆరోగ్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వారి కుటుంబసభ్యులకు రూ.2 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్‌ను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

మన్ననూర్: అమ్రాబాద్–మన్ననూర్ ప్రధాన రహదారి ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి పాడి ఆవు మృతి చెందింది. వివరాల ప్రకారం... అంబేద్కర్ కాలనీలోని దాసరి వెంకటేశ్వర్లకు చెందిన ఆవు రోజు మాదిరిగానే పశువుల గుంపుతో కలిసి అటవీ ప్రాంతానికి మేత కోసం వెళ్లింది. సాయింత్రం తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో అప్పటికే వర్షం కురిసింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న వైర్ ఆవు తగలడంతో విదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. నిరుపేద అయిన బాధిత కుటుంబాన్ని ఆదుకొని ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ప్రధాన రహదారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేని కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు. గతంలో గేదె, ఆవు మృతి చెందిందని ప్రజలు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మహిళలకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంపై ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దొంగతనాలు, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వృద్ధులకు మాయమాటలు చెప్పి బంగారు లేదా డబ్బులు తీసుకువెళ్లడం, ఏటీఎంల దగ్గర చోరీలు జరుగుతున్నాయన్నారు. అలాగే ఎవరైన తెలియనివారు వచ్చి ఆధార్, ఏటీఎం నంబర్ చెప్పకూడదని ఎస్‌ఐ తెలియజేశారు.

వనరులను రక్షించాలి



అచ్చంపేట రూరల్: భూమిపై ఉన్న ప్రతి వస్తువును రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సౌజన్యంతో యంగ్ ఎర్త్ లీడర్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన మందరం భూమికి లీడర్లుగా ఉండాలన్నారు. వనరులను రక్షించుకుని భావి తరాలకు అందించే విధంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూమి, గాలి, నీటి కాలుష్యాన్ని నివారించడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలన్నారు. నేల తల్లిని సుభిక్షంగా ఉంచితేనే ఏ కాలుష్యమైన నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఏపీజీవీబీ ఆర్థిక అక్షరాస్యత కళాజాతా



ఏపీజీవీబీ పథకాలను వివరిస్తున్న కళాజాతా సభ్యులు

ఉప్పునుంతల: స్థానిక ఏపీజీవీబీ వద్ద గురువారం ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాతా బృందం ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన కళాజాతా బ్యాంక్ వినియోగదారులను, గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. బ్యాంక్ రుణాలు, డిపాజిట్లు, బ్యాంక్‌లో అమలుచేస్తున్న సామాజిక భద్రత పథకాలపై కళాకారులు ఆటాపాటలతో వివరించారు. ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, అటల్‌పెన్షన్ యోజన, బంగారు ఆభరణాలపై రుణాలు తదితర అంశాలపై పాటల ద్వార ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి చెప్పారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ రీజనల్ ఆఫీస్ నోడల్ ఆఫీసర్ సీవీ రమేష్, స్థానిక బ్యాంక్ మేనేజర్ క్రాంతి కుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు గోపాల్, శ్రీనివాస్‌శెట్టి, ఆఫీస్ అసిస్టెంట్ ఎల్ ఇష్మాన్ ఆలీ, కళాజాత బృందం సభ్యులు విజయ్, మెజీషియన్ డప్పు ప్లేయర్ చిరంజీవి, వినియోగదారులు, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛత ఉత్సవ దరఖాస్తులకు ఆహ్వానం

అచ్చంపేట రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చిన మగువలను మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత ఉత్సవ–2023 అవార్డులతో సత్కరించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, ఎన్‌జీఓలు ప్రతి రోజు వెలువడే వ్యర్థాల శుద్ధీకరణ, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకు శుభ్రపర్చుట, తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, శిక్షణలు, సాంకేతిక పరంగా విభిన్న రకాలు తయారు చేసే వివిధ రంగాల మహిళలు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



హెల్త్‌కార్డులు అందిస్తున్న సురేందర్‌గౌడ్

కల్వకుర్తిరూరల్: ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని ప్రజలందరి ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సురేందర్‌గౌడ్ కోరారు. గురువారం మండలంలోని తర్నికల్‌లో ప్రజలకు ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు ద్వార ప్రవేట్ ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సాయిబాబు, ప్రశాంత్‌గౌడ్, రాజు, వీరాస్వామి, శ్రీశైలం, చెన్నయ్య, సంజీవ్‌కుమార్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీఓకు వినతి



పెద్దకొత్తపల్లి: సాతాపూర్ గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కొల్లాపూర్ ఆర్‌డీఓ హనుమానాయక్‌కు అఖిలపక్షం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గతంలో సాతాపూర్ రెవెన్యూగా ఉందని, ప్రస్తుతం సాతాపూర్ చుట్టు పక్కల పది గ్రామాలు ఉన్నందున నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో తిరుమల్, పరుశరాం, ప్రవీణ్‌కుమార్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సరిచేయండి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి ప్రతి రోజు వందలాది మంది రోగులు వస్తుంటారు. ఆస్పత్రిలోని ఓ వార్డులో రద్దీగా ఉండే ప్రదేశంలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు తేలి ఉన్నాయి. చాలా ఏళ్లుగా తేలిన తీగలు కన్పిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. చేతులకు అందే ఎత్తులోనే ప్రమాదకరంగా తీగలు ఉండటం, వైర్ల చివర్లో కనీసం టేపు కూడా వేయకుండా ఉండడంతో ప్రజలు జంకుతున్నారు. గురువారం అచ్చంపేటకు వచ్చిన డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌కు రోగులు తేలిన తీగలను చూయించారు. ఈ మేరకు తేలిన తీగలను సరి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



తేలిన తీగలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

పోషకాహారం తీసుకోవాలి

తాడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంతో పాటు గర్భిణులకు గుడ్లు అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని డీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు మంచిగా నడుస్తున్నాయని అన్నారు. పిల్లలకు పోషకాహార పదార్థాలను అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఆన్‌లైన్ కావడంతో వర్కర్‌లు, ఆయాలు సమయపాలన పాటిస్తున్నారన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్‌గా తయారు చేసేందుకు సర్పంచ్ నిరంజన్, గ్రామస్తులు ఎంతో శ్రద్ధ కనబర్చారన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సంగీత, సూపర్‌వైజర్ వనజ, రామకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి

సెకండియర్ పరీక్షలు ప్రారంభం

కొల్లాపూర్: ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ బాలికల, బాలుర కళాశాలలతో పాటు గాయత్రీ, మహాదేవి జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 559 మంది విద్యార్థులకు తొలిరోజున పరీక్షలకు 537 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కోడేరు: గురువారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 332మంది విద్యార్థులకు 320 మంది హాజరు కాగా 12మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ భల్లారి శేఖర్ తెలిపారు.



హాల్‌టికెట్ల నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని తుర్కలపల్లికి చెందిన రైతులు రామస్వామి, దుర్గయ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ బుధవారం సాయంత్రం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ మేరకు ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

కోడేరు: మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుడు మైబూస్ ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని సర్పంచ్ వెంకటస్వామి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రఘువర్దన్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, మద్దిలేటి, దర్గయ్య, గోపాల్, జగపతి, యాపచెట్టు లాలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎన్‌వీ ఫౌండేషన్ సభ్యులు

రూ.5వేల ఆర్థిక సహాయం

మండలంలోని సింగాయిపల్లికి చెందిన శివయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబాన్ని ఎన్‌వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క గోపాల్‌యాదవ్ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో తీగలపల్లి సర్పంచ్ శివారెడ్డి, ఆంజనేయులు, రాంచందర్, రవి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి 30 క్వింటాళ్ల బియ్యం వితరణ



దాతలను సన్మానిస్తున్న ఆలయ అర్చకుడు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. గురువారం బల్మూర్ మండలానికి చెందిన మేడిపూర్ మల్లేశ్వర్, ఇందిర దంపతులు 30 క్వింటాళ్ల బియ్యంను అందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు వీరయ్యాశాస్త్రి, రామకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

ఉప్పల్‌పహాడ్‌లో ‘కంటి వెలుగు’

వంగూరు: మండల పరిధిలోని ఉప్పల్‌పహాడ్‌లో గురువారం రెండవ విడత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుగుణమ్మలు పరీక్ష చేయించుకున్నారు. ప్రభుత్వం ప్రారంభించిన కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుధాకర్, సూపర్‌వైజర్ రోజమ్మతోపాటు టీఆర్‌ఎస్ నాయకులు లాలూయాదవ్, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మిషన్ అంత్యోదయపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగామోహన్

తాడూరు: మిషన్ అంత్యోదయపై గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంగామోహన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ అంత్యోదయపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత నిర్వహించే వైబ్రెంట్ గ్రామసభ సీన్స్ నిర్వహించే విధానం వార్డు మెంబర్‌లతోపాటు గ్రామస్తులకు అర్థమయ్యే రీతిలో వివరించి ప్రజల్లో మార్పు తీసుకురావాలని కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా కార్యదర్శులు ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుద్ధ్యం, పచ్చదనం తెలంగాణకు హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరిపై ఉందన్న విషయాన్ని మర్చిపోరాదన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ ప్రవీన్, ఉపాధిహామీ ఈసీ కిషన్‌నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల నిరసన

కొల్లాపూర్: టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై ఆందోళన చేపట్టిన బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భాను అరెస్టును నిరసిస్తూ పట్టణంలో ఆ సంఘం నాయకులు దీక్ష చేపట్టారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్‌చంద్రతో పాటు పలువురు నాయకులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన దీక్షలో కూర్చున్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వారు డిమాండ్‌చేశారు. బీజేవైఎం నేత భానుపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, మల్లిఖార్జున్, శివకృష్ణ యాదవ్ తదితరులున్నారు.



దీక్షల్లో కూర్చున్న బీజేవైఎం నాయకులు

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

మన్ననూర్: టీఎస్‌పీఎస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్, టీపీఓ వెటర్నరీ సర్జన్ తదితర ప్రశ్న పత్రాల లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత అంటూ యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపు మేరకు ఎండీ ఖైరత్ ఆధ్వర్యంలో అమ్రాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఉద్యోగ నోటిఫికేషన్ లేక నిరుద్యోగ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు కావొస్తున్న క్రమంలో ఒక్క నోటిఫికేషన్ వేసి ప్రశ్నాపత్రాలు లీక్ చేయడం దురదృష్టకరమన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరినారాయణ గౌడ్, రేణయ్య, శివ, రామాంజనేయులు, మహేష్, వెంకటయ్య, నరహరి, తిరుపతయ్య, చంటి, లాలయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు